క్లుప్తంగా

వాలీబాల్ కిట్లు పంపిణీ

ఇల్లెందురూరల్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సమకూర్చిన వాలీబాల్ కిట్లను మండలంలోని జగదాంబగుంపు గ్రామ యువతకు ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, సర్పంచ్ స్వాతి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖాళీ సమయాలలో క్రీడలకు ప్రాధాన్యమిస్తూ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆకాంక్షించారు. ఊరకొండ ధనుంజయ్, ముక్తి కృష్ణ, శారద, పాయం ఆంజనేయులు, రావూరి సతీష్ పాల్గొన్నారు.

'ఐఎన్‌టీయూసీ నేతలు.. కేడర్ లేని లీడర్లు'

ఇల్లెందు: ఐఎన్‌టీయూసీ నేతలు కేడర్ లేని లీడర్లుగా మిగిలిపోయారని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ అన్నారు. శుక్రవారం ఇల్లెందులో జరిగిన టీబీజీకేఎస్ సమావేశంలో ఎన్నికల కోసం కల్లబొల్లి కబుర్లు చెబుతోందని తెలిపారు. ఇంటి కొట్లాటతో వేజ్‌బోర్డు సమస్యను కోర్టు వరకు తీసుకెళ్లిన కార్మిక సంఘంగా ఐఎన్‌టీయూసీ మిగిలిపోయిందన్నారు. డిపెండెంట్ ఉద్యోగాలు పోగొట్టి నీతులు చెప్పే స్థాయికి చేరిందన్నారు. రానున్న సింగరేణి ఎన్నికల్లో టీబీజీకేఎస్ విజయాన్ని ఏ శక్తి ఆపలేదని ధీమా వ్యక్తం చేశారు. కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, గౌస్‌మియా, సంజీవరావు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓ పర్యటన

చుంచుపల్లి: ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని రామాంజనేయ కాలనీ, వెంకటేశ్వర కాలనీ గ్రామపంచాయతీల్లో జెడ్పీ సీఈఓ విద్యాలత విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పచ్చదనం – పారిశుద్ధ్యంపై పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నర్సరీలు, ఎవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలించి వేసవికాలం రాబోతున్న నేపథ్యంలో మొక్కల సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు జ్ఞానమూర్తి సరిత, తేజావత్ రతన్‌నాయక్, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ సత్యనారాయణ, పంచాయతీ సెక్రటరీ ఇందిరా, ఉపాధి హామీ పథకం ఇంజనీరింగ్ కన్సల్టెంట్ పి.నాగరాజు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యతోనే సమాజాభివృద్ధి

ఇల్లెందు: శాస్త్రీయ విద్య ద్వారానే సమసమాజాభివృద్ధి సాధ్యమని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ అన్నారు. శుక్రవారం పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విప్లవ విద్యార్థి ఉద్యమంలో అసువులు బాసిన అమరుల జ్ఞాపకాలతో ముద్రించిన క్యాలెండర్లను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, వెంకటేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేరిస్తే సహించం

కొత్తగూడెంటౌన్: ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చితే సహించేది లేదని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది బానోతు రమేష్‌నాయక్ అన్నారు. శుక్రవారం బస్టాండ్ సెంటర్‌లో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో గిరిజనులు ఆర్థికంగా సామాజికంగా విద్య, ఉద్యోగ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ఇప్పటికీ సరైన వైద్యం, పౌష్టికాహారం తాగునీరు అందక దుర్భర జీవితాన్ని గడుపుతున్నట్లు చెప్పారు. నేటికీ గిరిజనుల గ్రామాల్లో విద్యుత్, రోడ్డు, రవాణా వ్యవస్థ అందుబాటులో లేవని వాల్మీకి బోయ ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడం కేసీఆర్ ఓట్ల కోసం ఆడుతున్న డ్రామా అని ఇది ముమ్మాటికీ వాల్మీకి, బోయ తదితర కులాలను మభ్య పెట్టడమేనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. మంగీలాల్ నాయక్, బాలాజీ, ప్రసాద్ పాల్గొన్నారు.

'సబ్ కీ యోజన.. సబ్ కీ వికాస్'పై సమీక్ష

సుజాతనగర్: 2023–24 ఆర్థిక సంవత్సరంలో 'సబ్ కీ యోజన.. సబ్ కీ వికాస్'పథకంలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా గ్రామాలలో చేపట్టనున్న అభివృద్ధి పనులను త్వరితగతిన గుర్తించాలని కోరారు. నాయకులగూడెం సర్పంచ్ మండె నాగరాజేశ్వరి మాట్లాడుతూ.. తమ గ్రామంలో పలువురు లబ్ధిదారులు ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు నిర్మించుకున్నా బిల్లులు రాలేదని తెలిపారు. పాత అంజనాపురం సర్పంచ్ భూక్యా రవికుమార్ మాట్లాడుతూ.. తమ పంచాయతీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు ఏఈ లేకపోవడంతో నీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి తాను ఎంతగానో శ్రమిస్తున్నా కొందరు ప్రజాప్రతినిధులు మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని వాపోయారు. మండలంలో అధికారుల కొరతకు తానే కారణమని తనను టార్గెట్ చేస్తున్నారని, తన పనితీరు నచ్చకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి బదిలీ చేయాలన్నారు.

ఉధృతమవుతున్న ఉద్యమం

కొమరారాం నూతన మండలమే లక్ష్యం

- పది రోజులుగా కొనసాగుతున్న దీక్షలు
- సంఘీభావం ప్రకటిస్తున్న వివిధ రాజకీయ పక్షాలు


దీక్షలో కూర్చున్న కొమరారాం వాసులు

ఇల్లెందురూరల్: సుదీర్ఘకాలంగా ప్రజల ఆకాంక్ష.. రాజకీయ పక్షాలు, ప్రజాప్రతినిధుల హామీలు.. మండలం ఏర్పాటుకు అవసరమైన వనరులు.. జనాభా.. భూ వైశాల్యం సమృద్ధిగా ఉన్నప్పటికీ లోపం ఎక్కడుందో తెలియదు కానీ చిన్నచిన్న గ్రామ సమూహాలను మండలాలుగా ప్రకటిస్తున్న ప్రభుత్వం కొమరారంపై చిన్నచూపు చూస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. గడిచిన ఆరేళ్లుగా కొమరారం నూతన మండలం పేరుతో తరచూ ఆందోళనలు కొనసాగుతున్నప్పటికీ ప్రస్తుతం ప్రజాపంథా ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పక్షాల మద్దతుతో కొనసాగుతున్న ఉద్యమం క్రమంగా తీవ్రరూపం దాలుస్తోంది.. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలలోనే నూతన మండలంగా ప్రకటించాలనే డిమాండ్‌తో పది రోజులుగా కొనసాగుతున్న ఉద్యమం సఫలీకృతమవ్వాలని ఆశిద్దాం.

జిల్లాల పునర్విభజన నాటి నుంచి..

ఆరేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేపట్టింది. ఆ సమయంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన మండలాలను ఏర్పాటు చేసింది. ఆ సమయంలోనే అత్యధిక జనాభా కలిగి ఉన్న ఇల్లెందు మండలాన్ని రెండుగా విభజించి కొమరారంను నూతన మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో అన్ని రాజకీయ పక్షాలు ఉద్యమబాట పట్టాయి. కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఉద్యమం క్రమంగా నీరుగారిపోయింది. ఆరు నెలల క్రితం మరోసారి నూతన మండలాలను ప్రభుత్వం ప్రకటించిన సమయంలోనూ అన్ని రాజకీయ పక్షాలు కొమరారంకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అఖిల పక్షం పేరుతో మంత్రులను సైతం కలిసి వినతిపత్రాలు అందజేశారు. కానీ రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని మండలాలు ప్రకటించిన ప్రభుత్వం మరోసారి కొమరారంను విస్మరించింది.

ఇప్పుడు కాకపోతే మరెప్పుడు..

మరో ఏడాది వ్యవధిలో సార్వత్రిక ఎన్నికలు ఉండటం, తాజాగా బడ్జెట్ సమావేశాలు కొనసాగుతుండటంతో ప్రజాపంథా నాయకులు మరోసారి కొమరారం మండల కేంద్రం డిమాండ్‌తో ఉద్యమం ప్రారంభించారు. ఇప్పుడు కాకపోతే మరెప్పుడు అని ప్రశ్నిస్తూ ప్రణాళికాబద్ధంగా రిలే నిరాహార దీక్షలతో ఉద్యమం ప్రారంభించి అన్ని వర్గాల ప్రజలు, అన్ని రాజకీయ పక్షాలు, ఈ ప్రాంతానికి సంబంధించిన ప్రజాప్రతినిధుల మద్దతు కూడగట్టడంతో సఫలీకృతమవుతున్నారు. క్రమంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ నూతన మండలం ఏర్పాటు లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

రాజకీయ పక్షాల సంఘీభావం..

కొమరారంను నూతన మండలంగా ప్రకటించాలనే డిమాండ్‌తో కొనసాగుతున్న ఉద్యమానికి అన్ని రాజకీయ పక్షాలు తమ సంఘీభావం ప్రకటిస్తున్నాయి. అధికార బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సైతం ఉద్యమానికి తమ సంఘీభావం ప్రకటించడం గమనార్హం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో మద్దతు తెలుపుతున్న రాజకీయ పక్షాలు రాష్ట్రస్థాయిలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ప్రజలు కోరుతున్నారు.


కొమరారం గ్రామం వ్యూ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాపంథా కార్యకర్తలు

ప్రజల ఆకాంక్షలను గుర్తించాలి



పరిపాలన ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో చిన్న జిల్లాలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం విశాలంగా ఉన్న ఇల్లెందు మండలంలో కొమరారం కేంద్రంగా నూతన మండలం ఏర్పాటును విస్మరించడం బాధాకరం. ప్రజల ఆకాంక్షలను గుర్తించి ప్రభుత్వం వెంటనే నూతన మండలంగా కొమరారంను ప్రకటించాలి.

– ఎలిమిశెట్టి వెంకటయ్య, రైతు, కొమరారం

ప్రభుత్వం స్పందించాలి



కొమరారంను మండలంగా ప్రకటించేందుకు అవసరమైన భౌగోళిక పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. గతంలో సర్వే నిర్వహించిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం చేస్తోంది. నూతన మండలం డిమాండ్‌తో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. ప్రభుత్వం స్పందించే వరకు విశ్రమించబోం.

– బండారు సత్యం, రైతు, మాణిక్యారం

అంకిత భావంతో విద్యాసంస్థల నిర్వహణ


వార్షికోత్సవ వేడుకలు ప్రారంభిస్తున్న డైరెక్టర్లు, అతిథులు

చుంచుపల్లి: తొలిసారి కొత్తగూడెం ప్రాంతంలో విద్యాసంస్థలను ఏర్పాటు చేసి ఆ తర్వాత విస్తరింపజేస్తూ అంకితభావంతో ముందుకు సాగుతున్నామని కృష్ణవేణి–త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్లు మాచవరపు కోటేశ్వరరావు, గొల్లపూడి జగదీష్ చౌదరి తెలిపారు. కృష్ణవేణి విద్యాసంస్థల వార్షికోత్సవంలో వారు మాట్లాడారు. తమ వద్ద చదువుకున్న ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరారని చెప్పారు. నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయంగా తమ విద్యాసంస్థలు పనిచేస్తుండగా, తమ కృషికి తల్లిదండ్రుల ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కళాశాల సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనగా, విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

హెల్త్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ


డైరీలను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ శిరీష

చుంచుపల్లి: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఐఎన్‌టీయూసీ 3194 జిల్లా శాఖ నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగులు ఐక్యంగా జిల్లాను ఆరోగ్యవంతమైన జిల్లాగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ పోరండ్ల శ్రీనివాసరావు, సెక్రటరీ యశోద, గౌరవ అధ్యక్షుడు జి.నాగభూషణం, చీఫ్ అడ్వైజర్ ఎండీ. ఫయాజ్ మొహిద్దిన్, డాక్టర్ మణికంఠరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పర్సినాయక్, బి.రామచందర్, బి.దేవా, బి.హరికృష్ణ, కె.రామకృష్ణ ,శ్రీకాంత్, అప్పన్న, నగేష్, దుర్గాప్రసాద్, బి.రాంప్రసాద్, యూనియన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు కేజీబీవీలో సమీక్ష


సమావేశంలో ఎంఈఓ వెంకట్, ఉపాధ్యాయులు

జూలూరుపాడు: జూలూరుపాడు కేజీబీవీ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థుల ఇంటర్నల్ మార్కులపై శుక్రవారం మానిటరింగ్ నిర్వహించారు. మానిటరింగ్ టీమ్ లీడర్లు బి.బాలాజీ, ఎస్.దుర్గాప్రసాద్‌రావు, వి.లలితా భవానీ ఆధ్వర్యంలోని బృందం సభ్యులు పదో తరగతి సబ్జెక్టుల వారిగా నిర్మాణాత్మక మూల్యాంకనం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ వెంకట్ కేజీబీవీని సందర్శించి, మానిటరింగ్ తీరుతెన్నులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ పద్మజ, మానిటరింగ్ సభ్యులు హరిలాల్, శ్యామలబాయి, సల్మాన్ రాజ్, ఆర్.శ్రీనివాసరావు, బి.సంపత్, కృష్ణ పాల్గొన్నారు.

మార్చి 3న శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం


కల్యాణ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి వీకే–7షాఫ్ట్ సమీపంలోని గుట్ట మీద కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం మార్చి 3న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తరుపున గని మేనేజర్ జర్పుల శంకర్ తెలిపారు. శుక్రవారం ఆలయం ఆవరణలో కల్యాణ మహోత్సవ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ వేడుకలు ప్రతి సంవత్సరం వారం రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది కూడా కొత్తగూడెం పట్టణ ప్రజలు, పురప్రముఖులు, ఏరియా అధికారులు, కార్మికులు వారి కుటుంబ సభ్యులతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, పిట్ ఇంజనీర్ గోదావరి శ్రీనివాస్, పిట్ సెక్రటరీ శనిగరపు శంకర్, ఎస్‌ఓ అభిలాష్, బాలేరు, కుమార్‌రావు, సురేష్, ఆలయ అర్చకులు శశి తదితరులు పాల్గొన్నారు.

రేపు జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 12వ తేదీన కొత్తగూడెంనకు తెలంగాణ సాహిత్య అకాడమీ సెక్రెటరీ డాక్టర్ నామోజు బాలచారి రానున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన విడుదలయింది. కొత్తగూడెంలోని సింగరేణి కళాశాలలో 12 తేదీన జరగనున్న తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జరుగనున్న జర్నలిస్టుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న నాయకులు

పాల్వంచ: గ్రూప్ వన్ కోచింగ్ తీసుకుంటున్న పేద విద్యార్థినికి వర్తక సంఘం నాయకులు అండగా నిలిచారు. ఇల్లెందుకు చెందిన కుంచపర్తి పుష్ప కూతురు వనజ గ్రూప్ వన్ కోచింగ్ తీసుకుంటోంది. కాగా ఆర్థిక స్తోమత లేకపోవడంతో.. పాల్వంచ వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాష్, వసుంధర జ్యూవెలరీ అధినేత సంకా రామారావు వనజకు శుక్రవారం రూ.10 వేల సహాయాన్ని అందించారు.

మోటారు చోరీపై ఫిర్యాదు

సుజాతనగర్: నిమ్మలగూడెం గ్రామంలోని శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారు చోరీకి గురైంది. ఈ మేరకు సర్పంచ్ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. ఈ నెల 8న గ్రామ పంచాయతీ సిబ్బంది పనుల నిమిత్తం శ్మశానవాటికకు వెళ్లగా మోటారు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు ఫిర్యాదు అందజేశారు.

మట్టి లారీ పట్టివేత

పాల్వంచరూరల్: మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. వివరాలు... కిన్నెరసాని పంచాయతీ రాజాపురం సమీపంలో కొద్దిరోజులుగా అక్రమార్కులు రాత్రిపూట మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గురువారం తెల్లవారుజామున రాజాపురం నుంచి పాల్వంచ వైపు మట్టి లోడును తరలిస్తున్న టీఎస్ 20టి 8499 లారీని ఎస్‌ఐ.శ్రీనివాస్ పట్టుకున్నారు. లారీని తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరామర్శ

టేకులపల్లి: టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామంలో పెరుగు కోటమ్మ(80) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, ఇల్లెందు ఏఎంసీ చైర్మన్ బాణోతు హరిసింగ్ నాయక్, ఎంపీటీసీ జాల సంధ్య, సర్పంచ్ పూనెం ఉమ, మాజీ సర్పంచ్ పూనెం సురేందర్, మాజీ సొసైటీ చైర్మన్ దళపతి శ్రీనివాస్‌రాజు, బీఆర్‌ఎస్ నాయకులు చీమల సత్యనారాయణ, బాణోతు రామ తదితరులు వేర్వేరుగా మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం


కరపత్రాలు అందజేస్తున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పాలన సాధ్యమని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం స్థానిక బొల్లేరుగూడెం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ.. మతాన్ని, ప్రాంతాన్ని అడ్డుపెట్టుకుని బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు అధికారంలోకి వచ్చాయని, ప్రజలకు సంక్షేమ పాలనను విస్మరించాయని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఎన్నికల హామీలను నెరవేర్చక పోగా అధిక ధరలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బాణాల నరసింహాచారి, కొండెం వెంకన్నగౌడ్, పైడిపల్లి మనోహర్, బద్ది కిషోర్, ఎస్‌ఏ జలీల్, వానపాకుల రాంబాబు, చాంద్‌పాషా, చంద్రగిరి సత్యనారాయణ, బత్తుల వెంకటేశ్వర్లు, నరేశ్, రాము నాయక్, బాలు నాయక్, గోపి, బాలాజీ, నాగేశ్వరరావు, వెంకట్, వాసు, సైదులు, సూర్యకిరణ్ పాల్గొన్నారు.

మండల సాధనకు పాదయాత్ర

ఇల్లెందురూరల్: కొమరారంను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22 నుంచి పాదయాత్ర చేపడుతున్నట్లు న్యూడెమోక్రసీ కొమరారం గ్రామ కార్యదర్శి వాంకుడోత్ మోతీలాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ప్రసుత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ కొమరారంను మండలంగా ప్రకటిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇంతేకాకుండా సార్వత్రిక ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్, పలు సందర్భాలలో స్థానిక ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రజలకు మాటిచ్చారని చెప్పారు. వారు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న మర్రిగూడెం గ్రామపంచాయతీ నుంచి ఇల్లెందు వరకు నాలుగు రోజుల పాటు పాదయాత్ర నిర్వహిస్తామని వివరించారు. ఈ పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజలు సంఘీభావం తెలిపి విజయవంతం చేయాలని కోరారు.

పోడు భూములకు హక్కులు కల్పించండి


ఇల్లెందురూరల్: తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం కార్యకర్తలు


పాల్వంచరూరల్: తహసీల్‌లో వినతిపత్రం అందజేస్తున్న పోడుసాగుదారులు

ఇల్లెందురూరల్: దరఖాస్తు చేసుకున్న ప్రతి పోడు భూమికి ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ విజయచందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నబీ మాట్లాడుతూ.. సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆయా భూములలో సర్వే చేయడం జరిగిందని గుర్తుచేశారు. సర్వే చేసిన ప్రతి ఎకరానికి పట్టాలివ్వాలని, లేనిపక్షంలో పోడు రైతుల పక్షాన ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మోహన్, రాందాస్, శంకర్, హుస్సేన్, కౌసల్య, సరిత, శంకర్, లలిత, వీరస్వామి, రాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: అనేక సంవత్సరాలుగా పోడు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న ప్రతిరైతుకు పోడు హక్కుపత్రాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పోడుసాగుదారులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండలంలో సర్వే చేసిన పోడు భూములకు హక్కు పత్రాలు ఇచ్చి రైతుబంధు అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోడుసాగుదారులకు హక్కులు కల్పిస్తామని చెప్పిన సీఎం హక్కు పత్రాల జారీలో తీవ్ర జాప్యం చేస్తున్నారని వెంటనే అమలు చేసి పోడుసాగుదారులను ఆదుకోవాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలను నిగ్గు తేల్చాలి


మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

సుజాతనగర్: ఉపాధి హామీ అక్రమాలపై సమగ్ర విచారణ నిర్వహించాలని ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో రూ.13 కోట్లతో పనులు జరిగినట్లు చెప్పారు. అధికారులు వారి తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ఓపెన్ ఫోరం నిర్వహించారని, పెద్దమొత్తంలో అవినీతి జరిగితే ఏదో మొక్కుబడిగా కేవలం రూ.4 లక్షల రికవరీ చూపించారన్నారు. అధికారులకు అనువైన వారిని తనిఖీ బృందానికి చూపించిమమ అనిపించారని, తనిఖీ బృందం అధికారులు కుమ్మక్కై అక్రమాలను పూర్తిస్థాయిలో వెల్లడించలేదని పేర్కొన్నారు. సామాజిక తనిఖీ తిరిగి నిర్వహించాలని, దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి, ఏపీఓ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించే వరకు ఉద్యమం


దీక్షను ప్రారంభిస్తున్న నబీ

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీ బస్తీ రాజీవ్ నగర్ గ్రామంలో పేదలు నిర్మించుకున్న గృహ సముదాయానికి మౌలిక వసతులు కల్పించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని సీపీఎం మండల కార్యదర్శి నబీ పేర్కొన్నారు. సదుపాయాలు కల్పన డిమాండ్‌తో సీపీఎం ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరాహార దీక్ష శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. సుదీర్ఘకాలంగా పేదలకు ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని కేటాయించాలని కోరినప్పటికీ ప్రభుత్వం విస్మరించిందని, ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ కనీస సౌకర్యాల కల్పనలో కూడా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి కృష్ణ, మోహన్, రాందాస్, వీరస్వామి, హుస్సేన్, విజయ, సరిత, నర్సయ్య, వెంకన్న, సుధాకర్, లలిత, కళ తదితరులు పాల్గొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న సీనియర్ క్లర్క్‌లకు సీనియారిటీ ప్రకారం పోస్టులు కేటాయించాలని శుక్రవారం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్లర్క్‌లు జీఎంతో మాట్లాడుతూ.. సీనియారిటీ ప్రకారం తమకు పోస్టులకు కేటాయించాలని, మిగిలిన పోస్టులకు కొత్తగా వచ్చే క్లర్క్‌లకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మిగిలిన పోస్టులలో ఇటీవల నియమింపబడిన ఇంటర్నల్ 141 క్లరికల్ పోస్టులకు సంబంధించి, కోర్టు నుంచి వచ్చిన 22 మంది, మొత్తం 163 మంది క్లరికల్స్‌కు వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జీఎం సమస్యను ఉన్నతాధికారులకు వివరించి పరిష్కార మార్గం చూస్తామని తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డుపై ప్రమాదకరంగా గుంత

ఖమ్మం, కొత్తగూడెం ప్రధాన రహదారిలోని రైల్వే వంతెన వద్ద నడిరోడ్డుపై ఏర్పడ్డ గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఈ ప్రాంతంలో పలుచోట్ల గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నారు. సరిగ్గా మూలమలుపు వద్దే గుంతలు ఉండటంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. గుంతలతో ఉన్న రహదారికి మరమత్తులు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

– సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి : శివగణేష్, ఆర్అండ్‌బీ ఏఈ
సెల్ నంబర్ : 9440819020